**చాప్టర్ 13**

## నియంత్రణ మరియు ఖాతాదారునికి  సూచన

| చాప్టర్‌లోని అంశాలు | పాఠ్యప్రణాళిక నేర్చుకోవడంలో ఫలితాలు |
|---|---|
| ఎ. ప్రభుత్వ పాత్ర | 13.2 |
| బి. భారతీయ మరియు అంతర్జాతీయ కీలక బీమా సంఘాలు | 13.3 |
| సి. ఐఆర్‌డీఏ, ఇతర నియంత్రణ సంస్థల బాధ్యతలు, అధికారాలు, విధులు | 13.1 |
| డి. ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000 | 13.1 |

**నేర్చుకోవడంలోని ఉద్దేశ్యాలు**

ఈ చాప్టర్ నేర్చుకున్నాక, మీరు ఈ క్రింది విషయాల్లో అవగాహన పొందగలరు:

- బీమా పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించడంలో భారత ప్రభుత్వం పోషిస్తున్న పాత్రను వివరించగలగడం;
- బీమా పరిశ్రమలో వివిధ భారతీయ మరియు అంతర్జాతీయ బీమా సంఘాల పాత్రను చెప్పగలగడం;
- బీమా నియంత్రణ సంస్థగా ఐఆర్‌డీఏ బాధ్యతలు, అధికారాలు, విధులను వివరించగలగడం;
- ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000లోని కీలక లక్షణాలను వివరించగలడం.

**పరిచయం**

మనం ఇప్పటికే బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీఏ) గురించి చదువుకున్నాం. అలాగే బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏ) చట్టం 1999 కింద ఇది ఎలా ఏర్పడిందో కూడా మనం గత చాప్టర్‌లో తెలుసుకున్నాం. భారతదేశంలో బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏ) పనిచేస్తోందని మనకు తెలుసు. పాలసీదారుల ప్రయోజనాలను కాపాడటంతోపాటు బీమా పరిశ్రమను నియంత్రించడం, ప్రోత్సహించడం, సజావుగా అభివృద్ధి చెందేలా చూడటం వంటి లక్ష్యాలతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ లక్ష్యాలను అందుకునేందుకు ఐఆర్‌డీఏకు కట్టబెట్టిన అధికారాలు, బాధ్యతలు మరియు విధుల గురించి మనం ఈ చాప్టర్‌లో నేర్చుకుందాం. అలాగే బీమా ఏజెంట్లకు లైసెన్సుల జారీ మరియు వాటి పునరుద్ధరణకు సంబంధించిన ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000 గురించి మీరు ఈ చాప్టర్ ద్వారా తెలుసుకుంటారు.

భారతదేశంలో బీమాను ప్రోత్సహించడంలో భారత ప్రభుత్వం మరియు ఇతర కీలక సంఘాలు పోషిస్తున్న పాత్ర గురించి తెలుసుకోవడం ద్వారా మనం ఈ చాప్టర్‌ను ప్రారంభిద్దాం.

| కీలక పదాలు | | | |
|---|---|---|---|
| ఈ చాప్టర్‌లో కింది పదాలు మరియు భావనల వివరణలు ఉన్నాయి: | | | |
| బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏ) | విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) | జీవిత బీమా కౌన్సిల్ | భారత బీమా గణకుల సంస్థ (ఐఏఐ) |
| భారత బీమా బ్రోకర్ల సంఘం (ఐబీఏఐ)/ | ఇన్సూర్యెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఐఐఐ) | టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ) | డీ - టారిఫికేషన్ |
| ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000 | లైసెన్స్ రద్దు | ప్రాక్టికల్ శిక్షణ | లైసెన్స్ జారీ |
| నైతిక నియమావళి | డూప్లికేట్ లైసెన్స్ | | |

**ఎ . ప్రభుత్వ పాత్ర**

చట్టానికి అత్యున్నత మూలాధార శక్తిగా, భారతదేశంలో బీమా పరిశ్రమ నియంత్రణలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోంది. బీమా పరిశ్రమను సజావుగా నియంత్రించేలా చర్యలు చేపట్టే అధికారాలు ప్రభుత్వానికి ఉన్నాయి. భారతదేశంలో బీమాను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉంటుంది.

**ఎ1 ఐఆర్‌డీఏకు బదులుగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వానికి ఉండే అధికారం**


కేంద్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా ఐఆర్‌డిఏకు బదులుగా వ్యవహరించేలా ఐఆర్‌డిఏ చట్టం ప్రభుత్వానికి అధికారం కల్పించింది. ఐఆర్‌డీఏ సరిగ్గా విధులు లేదా బాధ్యతలు (ఐఆర్‌డీఏ నియంత్రణలో లేని కారణాల చేత) చేపట్టలేకపోతోందని కేంద్ర ప్రభుత్వం ఒకవేళ భావిస్తే అప్పుడు ఈ అధికారాన్ని ఉపయోగించుకోవచ్చు. తనయొక్క విధులు మరియు బాధ్యతలను ఐఆర్‌డీఏ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తే , ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఐఆర్‌డిఏపై చర్యలు అవసరమైన సందర్భాల్లో కూడా ప్రభుత్వం ఈ విశేషాధికారాన్ని ఉపయోగించుకోవచ్చు.

**ఎ2 ఐఆర్‌డీఏతో కేంద్ర ప్రభుత్వానికి ఉండే సంబంధం**

ఐఆర్‌డిఏతో సంబంధాల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉంటుందని ఐఆర్‌డీఏ చట్టం చెబుతోంది. దీన్ని మనం ఈ రకంగా చెప్పుకోవచ్చు:

- పార్లమెంటులో చట్టం చేయడం ద్వారా ఐఆర్‌డిఏకు గ్రాంట్లు మంజూరు చేయడం
- ఐఆర్‌డీఏ అకౌంట్ల వార్షిక నివేదికను భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి పంపడం. తరువాత ఈ అకౌంట్ల నివేదికను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెడతారు.
- పాలనాపరమైన, సాంకేతికమైనవి కాకుండా విధానపరమైన ప్రశ్నలపై కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌డీఏకు ఆదేశాలు జారీ చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఈ ఆదేశాలను ఎప్పటికప్పుడు ఇవ్వచ్చు. ఐఆర్‌డీఏ ఈ ఆదేశాలకు కట్టుబడి ఉండాలి.
- బీమా పరిశ్రమ ప్రోత్సాహం లేదా అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదిత లేదా ప్రస్తుత కార్యక్రమాల వివరాలను ఐఆర్‌డీఏ ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి.
- ఐఆర్‌డీఏ చట్టంలో నిబంధనలు రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేస్తే సరిపోతుంది.

ఐఆర్‌డీఏ మరియు కేంద్ర ప్రభుత్వం మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేసే రేఖాచిత్రం 13.1




**ఎ3 పరిశ్రమ అభివృద్ధిలో ప్రభుత్వ పాత్ర**

బీమా పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వివిధ కేటాయింపులు చేస్తుంది. బీమా రంగంలో విదేశీ పెట్టుబడిని అంగీకరించడం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద నిర్ణయం. దీన్నే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) అంటారు.

**ఎ 3ఏ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి**

2000 సంవత్సరానికన్నా ముందు, భారతదేశంలో బీమా కార్యకలాపాలను కొనసాగించే హక్కు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ)కు మాత్రమే ఉండేది.

బీమా దీర్ఘకాలిక పెట్టుబడి ఆధారిత వ్యాపారమైనందున ఇందుకు ఎంతో నైపుణ్యం అవసరం. బీమా పరిశ్రమలోనికి ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఆహ్వానించాలనుకున్నప్పుడు వారికి సాంకేతిక పరిజ్ఞానంకానీ బీమా వ్యాపారానికి అవసరమైన పెట్టుబడికానీ లేదు. అందువల్ల బీమా మార్కెట్‌లో ప్రైవేటు భాగస్వామ్యం సజావుగా మొదలయ్యేందుకు, బీమా పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం బీమా రంగంలో 26% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి అనుమతించింది.

**గుర్తుంచుకోండి**

ప్రస్తుతమున్న ఎఫ్‌డీఐ చట్టాల ప్రకారం బీమా వ్యాపారంలోకి అడుగుపెట్టే దేశీయ ప్రైవేటు కంపెనీలు విదేశీ భాగస్వామ్య కంపెనీలతో కలిసి జాయింట్ వెంచర్లుగా ఏర్పడవచ్చు. ఈ విధానంలో విదేశీ భాగస్వామి 26% వరకూ మూలధనంలో వాటా కలిగి ఉండవచ్చు.

బీమా రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించిన 2000 సంవత్సరం నుండి దేశంలో బీమా మరింతగా చొచ్చుకుపోయింది. తమ అవసరాలకు అనుగుణంగా తక్కువ ప్రీమియాలతో అందుబాటులోకి వచ్చిన వివిధ రకాల పథకాల వల్ల వినియోగదారులు భారీగా లాభపడ్డారు. ఈ అభివృద్ధిని కొనసాగించేందుకు బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 49%కు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో పరిశీలనలో ఉంది. ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే విదేశీ భాగస్వాములు దేశీయ ప్రైవేటు భాగస్వాములతో కుదుర్చుకున్న జాయింట్ వెంచర్లలోని తమ వాటాను 49% పెంచుకోవచ్చు. ఈ రంగంలో పరిణామాల గురించి మీరు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిది.

చేయాల్సిన పని

ఏవైనా ఐదు ప్రైవేటు జీవిత బీమా కంపెనీల జాబితాను రూపొందించుకొని వాటిలో మూలధనాల వాటాల విధానం ఎలా ఉందో ఇంటర్నెట్ లేదా కంపెనీల యొక్క పథకాల కరపత్రాల ద్వారా తెలుసుకోండి. దేశీయ భాగస్వామ్య సంస్థలు, విదేశీ భాగస్వామ్య కంపెనీలకు ఎంత వాటా ఉందో చూడండి.

**ఏ3బీ ఆదాయపుపన్ను ప్రోత్సాహకాలు**

జీవిత బీమాలో వ్యక్తులు పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వం ఎటువంటి పన్ను ప్రోత్సాహకాలు అందిస్తుందో మనం ఇంతకుముందు చాప్టర్లలో చూశాం. ప్రభుత్వ చర్య దేశంలో జీవిత బీమా పెరగడానికి దోహదపడింది.

**ప్రశ్న 13.1**

ఐఆర్‌డీఏ తన విధులను నిర్వహించడంలో విఫలమైందని కేంద్ర ప్రభుత్వం ఒకవేళ భావిస్తే అప్పుడు ప్రభుత్వం ఏం చేయగలుగుతుంది?

**బీ భారతీయ మరియు అంతర్జాతీయ కీలక బీమా సంఘాలు**

భారతీయ బీమా పరిశ్రమలో పాత్ర పోషించే కీలక సంఘాల గురించి మనం ఈ విభాగంలో చూద్దాం.

**బీ1 బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏ)**

బీమా పరిశ్రమను నియంత్రించడంతోపాటు అభివృద్ధిపరిచేందుకు మల్హోత్రా కమిటీ నివేదిక ఆధారంగా 1999లో బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏ) స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా ఏర్పడిన విషయాన్ని మనం చాప్టర్ 1లో చూశాం. బీమా రంగంలో పోటీతత్వం పెంచడం, బీమా మార్కెట్‌లో ఆర్థిక భద్రతను కాపాడటంతోపాటు సరసమైన ప్రీమియములతో వినియోగదారులను సంతృప్తిపరచడం వంటి కీలక లక్ష్యాలను ఐఆర్‌డీఏ నిర్దేశించుకుంది. భారతదేశంలో బీమా అభివృద్ధి, నియంత్రణతోపాటు పునఃబీమా వ్యాపారాన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఐఆర్‌డీఏపై ఉంది.

గుర్తుంచుకోండి

ఐఆర్‌డీఏ ఏప్రిల్ 2000 సంవత్సరంలో చట్టబద్ధ సంస్థగా ఏర్పడింది.

ఐఆర్‌డీఏ విధులు, బాధ్యతలు, అధికారాలను మనం ఈ చాప్టర్‌లో తర్వాత తెలుసుకుందాం.

**బీ2 జీవిత బీమా కౌన్సిల్**

బీమా చట్టం 1938లోని సెక్షన్ 64ఎ కింద జీవిత బీమా కౌన్సిల్ ఏర్పాటైంది. ఎగ్జిక్యూటివ్ కమిటీ మరియు వివిధ సబ్ కమిటీల ద్వారా ఈ సంస్థ పనిచేస్తుంది. భారతదేశంలోని అన్ని జీవిత బీమా కంపెనీలు ఇందులో సభ్యత్వం కలిగి ఉంటాయి. బీమా పరిశ్రమ తరఫున ఈ సంస్థ అన్ని చర్చలను ప్రభుత్వం, ఐఆర్‌డీఏ, ప్రజలతో సమన్వయపరుస్తుంది. స్థూలంగా చెప్పాలంటే, జీవిత బీమా పరిశ్రమకు ఈ సంస్థ ఒక ముఖం వంటిది.

భారతదేశ జీవిత బీమా పరిశ్రమను నమ్మకమైనదిగా, క్రియాశీలమైనదిగా, లాభదాయకమైనదిగా మార్చడంలో కీలక పాత్ర పోషించాలని జీవిత బీమా కౌన్సిల్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

జీవిత బీమా కౌన్సిల్ విధులు ఈ కింది విధంగా ఉన్నాయి:

- అత్యున్నత నైతిక ప్రమాణాలు మరియు పర్యవేక్షణ అందించడం.
- బీమా పరిశ్రమపై ప్రజల్లో సానుకూలత కలిగేలా చూడటం, వినియోగదారుల విశ్వాసాన్ని పెంపొందించడం

- జీవిత బీమా పాత్ర మరియు ప్రయోజనాలపై అవగాహన కల్పించడం.
- ప్రభుత్వం, శాసనసభ్యులు మరియు నియంత్రణ సంస్థలతో నిర్మాణాత్మక చర్చలు నిర్వహించడం.
- జీవిత బీమాలో పరిశోధనలు నిర్వహిస్తూ బీమా రంగం అభివృద్ధికి దోహదపడటం.
- ఆర్థిక సేవల రంగం పరిధిలో ఇతర సంస్థలతో సంప్రదింపుల్లో ఫోరమ్‌గా వ్యవహరించడం
- బీమా విద్య, శిక్షణ, సదస్సుల్లో కీలక పాత్ర పోషించడం.
- సభ్యులకు అవసరమైన సాయం మరియు దిశానిర్దేశం చేయడం.
- భారత జీవిత బీమా పరిశ్రమ మరియు ప్రపంచ మార్కెట్ల మధ్య క్రియాశీల వారధిగా వ్యవహరించడం.

**బి3 జీవితేతర(సాధారణ) బీమా కౌన్సిల్**

భారతదేశంలోని సాధారణ (జీవితేతర) బీమా కంపెనీల ఉమ్మడి ప్రయోజనాలకు సాధారణ బీమా కౌన్సిల్ ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. ఉమ్మడి ప్రయోజనాల అంశాలపై స్పందించడం, విధానాల రూపకల్పనపై చర్చల్లో పాల్గనడం మరియు బీమా పరిశ్రమలో వినియోగదారుల సేవలపై అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఉద్బోధించడం వంటివి చేస్తుంది.

**బి4 భారత బీమా బ్రోకర్ల సంఘం (ఐబీఏఐ)**

భారత బీమా బ్రోకర్ల సంఘం (ఐబీఏఐ) ఐఆర్‌డీఏ లైసెన్సు పొందిన బీమా బ్రోకర్ల అత్యున్నత మరియు ఐఆర్ డిఎ చే గుర్తించబడిన సంఘం. బీమా కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడే వృత్తి నిపుణులుగా బీమా బ్రోకర్లను ఐఆర్‌డీఏ భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. బీమా బ్రోకర్‌కు బీమా కంపెనీ నుంచి ప్రతిఫలం అందినా అతను బీమా కొనుగోలుదారుడి తరఫున మాత్రమే ప్రతినిధిగా వ్యవహరిస్తాడు, కంపెనీ తరఫున కాదు.

గుర్తుంచుకోండి

బీమా బ్రోకర్ ద్వారా పథకాన్ని కొనుగోలు చేసినా పాలసీదారుడిపై ఎటువంటి అదనపు ఖర్చు ఉండదు.

**బి5 భారత గణకుల సంస్థ (ఐఏఐ)**

భారత గణకుల సంస్థ (ఐఏఐ) (గతంలో భారత గణకుల సంఘం - ఏఎస్ఐ) 1944లో ఏర్పడింది. అంతర్జాతీయ గణకుల సంఘంలో 1979లో సభ్యత్వం పొందిన సంస్థగా రిజిస్టర్ అయింది.

గుర్తుంచుకోండి

బీమాలో దాగిఉన్న నష్టభయాన్ని అంచనా వేసేందుకు గణిత మరియు సంఖ్యాశాస్త్ర పద్ధతులను ఉపయోగించే నిపుణుడినే గణకుడు(యాక్చురీ) అంటారు. ఉదాహరణకు, జీవిత బీమా కంపెనీలు ఉపయోగించే మరణాల చిట్టాను గణకులు ఎలా రూపొందిస్తారో మనం చాప్టర్ 4లో చూశాం. గణకుడు తప్పనిసరిగా భారత గణకుల సంస్థ (ఐఏఐ)లో సభ్యుడు అయిఉండాలి.

ఐఏఐ ఈ కింది ఉద్దేశాల కోసం ఏర్పడింది:

- భారతదేశంలో గణకుల వృత్తిని ప్రోత్సహించడం;
- గణక వృత్తిలోని సభ్యులంతా పరస్పరం చర్చించుకునేందుకు అవకాశాలు కల్పించడం;
- సంబంధిత అంశాలపై పరిశోధన మరియు బోధనలకు ఏర్పాట్లు చేయడం;
- గణక పరీక్షల కోసం చదువుకునే వారికి తగిన ఏర్పాట్లు మరియు దిశానిర్దేశం చేయడం.

**బి6 టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ)**

సాధారణ జీవిత బీమా వ్యాపారంలో బీమా కంపెనీలు ప్రతిపాదించే రేట్లు, నియమ నిబంధనలను నియంత్రించేందుకు బీమా చట్టం 1938లోని సెక్షన్ 64యూ కింద టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ) ఏర్పడింది. ఫలితంగా గతంలో చాలా బీమా పథకాల ధరలు టీఏసీ సూచించిన ప్రకారం ఉండేవి. జీవితేతర బీమా పరిశ్రమలో సమాచార సేకరణ కోసం ఐఆర్‌డీఏ నియమించిన సంస్థే టీఏసీ.

ఐఆర్‌డీఏ ప్రస్తుతం రేట్ల డీ టారిఫికేషన్ ప్రక్రియను దశల వారీగా అమలు చేసేందుకు కసరత్తులు చేస్తోంది. ఈ విధానం ఇప్పటికే కొన్ని జీవితేతర బీమా రకాలకు పూర్తయినా మిగిలిన వాటికి పూర్తికాలేదు.

**గుర్తుంచుకోండి**

డీ - టారిఫికేషన్ అంటే...నష్టభయం అంచనా ఆధారంగా, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా బీమా ధరను నిర్ణయించుకునే స్వేచ్ఛను బీమా కంపెనీలకు అప్పగించడం.

బీమా పథకాల ధరలను టీఏసీ ప్రస్తుతం నిర్ణయించనప్పటికీ టీఏసీ రూపొందించిన ప్రామాణిక విధాన పదాలను బీమా కంపెనీలు ఇప్పటికీ ఉపయోగిస్తున్నాయి.

**బి7 ఇన్స్యూరెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఐఐఐ)**

ఇన్స్యూరెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఐఐఐ) తొలుత 1955లో బీమా సంస్థల సమాఖ్యగా ఏర్పడి ఆపై 1987లో ఐఐఐగా రూపాంతరం చెందింది. భారతదేశంలో బీమా విద్య మరియు శిక్షణను అందించడమే ఈ సంస్థ ఉద్దేశం. ఐఆర్‌డీఏ, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని బీమా కంపెనీలు సహా బీమా పరిశ్రమలోని అన్ని విభాగాలతో ఐఐఐ సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తోంది.

ఈ సంస్థ వివిధ స్థాయిల్లో పరీక్షలను నిర్వహించడంతోపాటు చార్టర్డ్ ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ (కింద చూడండి) సహా కెనడా, అమెరికా, యూకేలలోని అంతర్జాతీయ బీమా సంఘాలతో కలిసి పనిచేస్తుంది.

**బి8 జాతీయ బీమా అకాడమీ (ఎన్‌ఐఏ), పుణే**

ఎల్‌ఐసీ, జీఐసీ మరియు నాలుగు (పీఎస్‌యూ) సాధారణ బీమా కంపెనీల మద్దతుతో ఎన్‌ఐఏను ప్రభుత్వం 1980లో ఏర్పాటు చేసింది. బీమా సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన శిక్షణ మార్గదర్శకాలను రూపొందించడం ఎన్‌ఐఏ ప్రధాన ఉద్దేశం. బీమా మరియు నష్టభయం నిర్వహణలో పరిశోధన, శిక్షణ, విద్య, ప్రచురణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌ఐఏ అత్యున్నత సంస్థగా వ్యవహరిస్తోంది. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఎన్‌ఐఏ చాలా మంది బీమా ఎగ్జిక్యూటివ్‌లను తయారుచేసింది.

**బి9 చార్టర్డ్ ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ (సీఐఐ)**

చార్టర్డ్ ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ (సీఐఐ)ను రాయల్ చార్టర్ 1912లో యూకేలో ఏర్పాటు చేసింది. 95,000 మంది సభ్యులతో 150కిపైగా దేశాల్లో విస్తరించిన ఈ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద వృత్తిపరమైన బీమా మరియు ఆర్థిక సేవల సంస్థగా అవతరించింది. వృత్తిపరమైన ప్రపంచ ప్రమాణాలను స్థిరంగా కొనసాగించేలా సీఐఐ పనిచేస్తుంది. అలాగే బీమా సిబ్బంది, ఏజెంట్లలో నైపుణ్యం, సత్ప్రవర్తన పెంపొందించేందుకు స్థానిక నియంత్రణ సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమ సంస్థలతో సీఐఐ కలిసి పనిచేస్తుంది.

**బి10 బీమా మరియు నష్ట నిర్వహణ సంస్థ (ఐఐఆర్ఎం), హైదరాబాద్, ( ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్స్యూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్ మెంట్)**

బీమా మరియు నష్ట నిర్వహణ సంస్థ (ఐఐఆర్ఎం) ఓ అంతర్జాతీయ విద్యా మరియు పరిశోధన సంస్థ. ఐఆర్‌డీఏ చట్టం 1999లోని సెక్షన్ 14(ఎఫ్) నిబంధనల కింద ఐఆర్‌డీఏ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా దీన్ని 2002లో

ఏర్పాటు చేశాయి. బీమా మరియు నష్ట నిర్వహణ (సాధారణ మరియు దూరవిద్య కోర్సులు)లో అంతర్జాతీయ పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను ప్రోత్సహించేందుకు ఈ సంస్థను నెలకొల్పారు.

బీమా రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుగుతున్న మార్కెట్లు ఎదుర్కొనేలా దోహదపడాలని ఐఐఆర్ఎం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

**ప్రశ్న 13.2**

జీవిత బీమా కౌన్సిల్ విధులు ఏమిటి?

**సి. ఐఆర్‌డీఏ మరియు ఇతర నియంత్రణ సంస్థల విధులు, అధికారాలు, బాధ్యతలు**

**సి1 ఐఆర్‌డీఏ**

ఐఆర్‌డీఏ చట్టం 1999లోని సెక్షన్ 14లో ఐఆర్‌డీఏ విధులు, అధికారాలు, బాధ్యతలను పొందుపరిచారు. ఈ చట్టం ఐఆర్‌డీఏకు ఈ కింది అధికారాలు కట్టబెట్టింది:

ఎ) దరఖాస్తుదారులకు (కంపెనీలు) రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీ, పునరుద్ధరణ, సవరణలు, ఉపసంహరించడం, సస్పెండ్ లేదా రద్దు చేసే అధికారం;

బి) పాలసీ అసైన్ మెంట్, నామినేషన్, బీమాభిలాష, క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్, పాలసీ ఉపసంహరణ విలువ, బీమా కాంట్రాక్టులోని నియమ నిబంధనల విషయాల్లో పాలసీదారుల ప్రయోజనాలను కాపాడటం;

సి) మధ్యవర్తులు మరియు ఏజెంట్లకు ఉండాల్సిన అర్హతలు, నైతిక నియమావళి మరియు వాస్తవిక శిక్షణను సూచించడం;

డి) సర్వేయర్లు మరియు నష్టాన్ని అంచనా వేసే వ్యక్తులకు నైతిక నియమావళిని రూపొందించడం;

ఈ) బీమా వ్యాపారం నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించడం;

ఎఫ్) బీమా మరియు పునఃబీమా వ్యాపారానికి సంబంధించిన వృత్తిపరమైన సంస్థలను ప్రోత్సహిస్తూ నియంత్రించడం;

జి) బీమా కంపెనీల నుండి ఆర్థిక పథకాలకు రావాల్సిన ప్రీమియం ఆదాయపు శాతాన్ని తెలియజెప్పడం. తద్వారా క్లాజ్(ఎఫ్)లో పేర్కొన్న వృత్తిపరమైన సంస్థలను ప్రోత్సహిస్తూ నియంత్రించడం;

హెచ్) ఈ చట్టంలోని ఉద్దేశ్యాలను అమలు చేసేందుకు ఫీజులు మరియు ఇతర చార్జీలను విధించడం;

ఐ) బీమా వ్యాపారానికి సంబంధించిన కంపెనీల మరియు మధ్యవర్తుల, తదితర సంస్థల సమాచారాన్ని సేకరించడం, తనిఖీలు చేపట్టడం, ఆడిట్ నిర్వహించడం;

జె) టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ) నియంత్రణలో లేని సాధారణ బీమా వ్యాపారంలో బీమా కంపెనీలు ప్రతిపాదించే రేట్లు, నియమ నిబంధనలను నియంత్రించడం;

కె) బీమా కంపెనీలు, మధ్యవర్తిత్వం వహించే కంపెనీలు తమ అకౌంట్లను ఏ విధానంలో నిర్వహించాలో తెలియజేయడం;

ఎల్) బీమా కంపెనీల పెట్టుబడి విధానాలను నియంత్రించడం;

ఎం) ఒక్కో బీమా కంపెనీ సాల్వెన్సీ మార్జిన్‌ను కొనసాగించేలా నియంత్రించడం. (నోట్: సాల్వెన్సీ మార్జిన్ అంటే బీమా కంపెనీ ఆస్తులు అప్పులకన్నా అధికంగా ఉండటం);

ఎన్) బీమా కంపెనీలు మరియు మధ్యవర్తుల మధ్య తలెత్తే తగాదాలను పరిష్కరించడం;

ఓ) టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ) పనితీరును సమీక్షించడం (సెక్షన్ బీ6లో చూడండి);

పి) గ్రామీణ లేదా సామాజిక రంగంలో ఒక బీమా కంపెనీ, జీవిత బీమా మరియు సాధారణ బీమాను ఎంత శాతం చేపట్టాలో నిర్దేశించడం;

క్యూ) ఇతర అధికారాలను ఉపయోగించడం.

**సి2 భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ)**

భారతీయ రిజర్వు బ్యాంకు భారతదేశంలోని కేంద్ర బ్యాంకు. భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం 1934లోని నిబంధనల కింద 1935 ఏప్రిల్ 1న దీన్ని ఏర్పాటు చేశారు. భారతదేశంలో ఆర్థిక వ్యవస్థ నియంత్రణ, పర్యవేక్షణ, ఆర్థిక అధికార సంస్థగా ఆర్‌బీఐ వ్యవహరిస్తోంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థకు ఆర్‌బీఐ మార్గదర్శకాలను నిర్దేశిస్తోంది. అలాగే దేశ పరపతి విధానాన్ని రూపొందించి అమలు చేస్తూ ధరలు అదుపులో ఉండేలా చర్యలు చేపడుతోంది.

**సీ3 సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)**

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం 1992లోని నిబంధనల ప్రకారం సెబీ 1992 ఏప్రిల్ 12న ఏర్పడింది. భారతదేశంలో సెక్యూరిటీల మార్కెట్‌ను నియంత్రించడంతోపాటు సెక్యూరిటీల్లో పెట్టుబడిపెట్టే పెట్టుబడిదారుల ప్రయోజనాలను సెబీ కాపాడుతోంది. అలాగే సెక్యూరిటీల మార్కెట్ అభివృద్ధి చెందేలా ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడుతోంది.

**ప్రశ్న 13.3**


ఐఆర్‌డీఏ కీలక లక్ష్యాలు ఏమిటి?

**డి. ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000**

ఐఆర్‌డీఏ జూలై 2000 సంవత్సరంలో ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000 చట్టాన్ని రూపొందించింది. మీరు తెలుసుకోవాల్సిన కీలకమైన చట్టం ఇది. ఎందుకంటే...ఈ చట్టం బీమా ఏజెంట్లకు లైసెన్సుల జారీ మరియు పునరుద్ధరణకు సంబంధించిన అంశాలను పర్యవేక్షిస్తుంది.

**డి1 ఏజెంట్‌గా మారడం**

మీరు ఒకవేళ జీవిత బీమా ఏజెంటు అవ్వాలనుకుంటే చాలా అర్హతలు కలిగి ఉండటంతోపాటు నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.



**డి1ఏ దరఖాస్తు**

బీమా ఏజెంట్ అయ్యేందుకు లైసెన్స్ పొందాలనుకునే వ్యక్తి నియంత్రణ 3లో పేర్కొన్నట్లుగా తొలుత సంబంధిత విధానంలో దరఖాస్తు చేసుకొని దాన్ని నిర్దేశిత అధికారికి సమర్పించాలి. ఆపై నియంత్రణ 7లో పేర్కొన్నట్లుగా దరఖాస్తుతోపాటు రూ. 250 ఫీజును నిర్దేశిత అధికారికి అందజేయాలి.

**డి1బి అర్హత**

నియంత్రణ 4లో పేర్కొన్న అర్హతలు అభ్యర్థి కలిగి ఉండాలి.

| గత జనాభా లెక్కల ప్రకారం...దరఖాస్తుదారుడు 5,000 లేదా అంతకన్నా ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతంలో నివసిస్తుంటే | దరఖాస్తుదారుడు మరెక్కడైనా జీవిస్తుంటే. |
| --- | --- |
| • 12వ తరగతి పాసై ఉండాలి<br>• లేదా గుర్తింపు పొందిన ఏదైనా బోర్డు, సంస్థ నుంచి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి | • కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి.<br>• లేదా గుర్తింపు పొందిన ఏదైనా బోర్డు, సంస్థ నుంచి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. |

**డి1సి వాస్తవిక శిక్షణ**

నియంత్రణ 5లో పేర్కొన్నట్లుగా అభ్యర్థి వాస్తవిక శిక్షణ పొందాలి. తొలిసారి లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు దరఖాస్తుదారుడు గుర్తింపు పొందిన సంస్థ నుంచి జీవిత బీమా వ్యాపారంలో కనీసం 50 గంటల (కాంపోజిట్ ఏజెన్సీలో అయితే 75 గంటలు) వాస్తవిక శిక్షణ పొంది ఉండాలి. అయితే అభ్యర్థికి అదనపు విద్యార్హతలు ఉంటే ఈ నిబంధనలో సడలింపులు ఇవ్వవచ్చు. (ఉప నియంత్రణ (1)లో పేర్కొన్నట్లుగా).

**డి1డి పరీక్ష**

నియంత్రణ 6లో పేర్కొన్నట్లు దరఖాస్తుదారుడు జీవిత బీమా వ్యాపారానికి సంబంధించిన పరీక్షలో పాసై ఉండాలి. ఈ పరీక్షను ఇన్స్యూరెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఐఐఐ) లేదా దీన్ని నిర్వహించేందుకు ఆమోదం పొందిన ఏదైనా సంస్థ నిర్వహించాలి.

**డి1ఈ లైసెన్సు జారీ**

అభ్యర్థి ఈ కింది అర్హతలు కలిగి ఉంటే నిర్దేశిత అధికారి లైసెన్సు జారీ చేయవచ్చు:

- నియంత్రణ 4 (అర్హతలుంటే)కు అనుగుణంగా ఉంటే;
- నియంత్రణ 5 (వాస్తవిక శిక్షణ తీసుకున్న)కు అనుగుణంగా ఉంటే;
- నియంత్రణ 6 (సంబంధిత పరీక్ష పాసైతే)కు అనుగుణంగా ఉంటే;
- అన్ని నిబంధనలతో దరఖాస్తును పూర్తి చేస్తే;
- బీమా వ్యాపారానికి సంబంధించిన విజ్ఞానం ఉంటే;
- పాలసీదారులకు తగిన సేవలు అందించే సామర్థ్యం ఉంటే.

**డి1ఎఫ్ లైసెన్స్ పునరుద్ధరణ**

బీమా ఏజెంట్‌గా లైసెన్స్ పునరుద్ధరణ కోరే ముందు అభ్యర్థి గుర్తింపు పొందిన సంస్థ నుంచి జీవిత బీమా వ్యాపారంలో కనీసం 25 గంటల వాస్తవిక శిక్షణ పొంది ఉండాలి.(నియంత్రణ 5(3)

**డి1జి లైసెన్స్ రద్దు**

- బీమా ఏజెంట్‌గా ఉన్న వ్యక్తికి బీమా చట్టంలోని సెక్షన్ 42 సబ్ సెక్షన్(4)లో పేర్కొన్న అనర్హతలు ఉంటే అతను లైసెన్స్ ను రద్దు చేసుకోవచ్చు.
- వ్యక్తిగత ఏజెంట్ అనర్హతలు ఈ కింది విధంగా ఉంటాయి:
- ఆ వ్యక్తి మైనర్ అయినప్పుడు.
- ఏజెంట్ మానసిక పరిస్థితి బాగులేదని కోర్టు నిర్ధారించినప్పుడు
- మోసం, ఫోర్జరీ, విశ్వాస ఘాతుకం, నేరాలకు పురిగొల్పడం లేదా నేరం చేసినట్లు కోర్టు ధ్రువీకరించినప్పుడు.

- అయితే ఒకవేళ నేరం చేసినందుకు శిక్షను అనుభవించి ఐదేళ్లు పూర్తయితే అలాంటి వ్యక్తులకు అనర్హత వర్తించదు.
- ఏజెంట్ ఉద్దేశ్యపూర్వకంగా బీమా కంపెనీని మోసం చేయాలనుకున్నప్పుడు కూడా లైసెన్స్ ను రద్దు చేయవచ్చు.
- నిబంధనల ప్రకారం 12 నెలల శిక్షణ పూర్తి చేసుకోకపోయినా లేదా అందుకు సంబంధించిన అర్హతలు ఏజెంట్‌కు లేకపోయినా లైసెన్స్ రద్దు చేయవచ్చు.
- నైతిక ప్రవర్తనా నియమావళిని ఏజెంట్ ఉల్లంఘించినప్పుడు (సెక్షన్ డీ2).

**ప్రశ్న 13.4**

నూతన జీవిత బీమా ఏజెంట్ ఎన్ని గంటల వాస్తవిక శిక్షణ తీసుకోవాలి?

**డి1హెచ్ డూప్లికేట్ లైసెన్స్ జారీ**

బీమా ఏజెంట్ లైసెన్స్ పోగొట్టుకున్నా, లైసెన్స్ చిరిగినా సంబంధిత అధికార సంస్థ రూ. 50 ఫీజుతో డూప్లికేట్ లైసెన్స్ జారీ చేయవచ్చు.

**డి1ఐ లైసెన్స్ లేకుండా పనిచేయడం**

లైసెన్స్ లేకుండా బీమా ఏజెంట్‌గా వ్యవహరించే వ్యక్తికి రూ. 500 వరకూ జరిమానా విధించవచ్చు.

**డి2 ఏజెంట్ నైతిక ప్రవర్తనా నియమావళి**

లైసెన్స్ నిబంధనలతోపాటు బీమా ఏజెంట్ పాటించాల్సిన నైతిక ప్రవర్తనా నియమావళిని కూడా బీమా అభివృద్ధి మరియు నియంత్రణ సంస్థ పొందుపరిచింది. ఆ వివరాలను మనం చాప్టర్ 15లో చూద్దాం.

**ప్రశ్న 13.5**

బీమా ఏజెంట్ అవ్వాలంటే ఎటువంటి చర్యలు అనుసరించాలి?

**కీలకాంశాలు**

ప్రభుత్వ పాత్ర

- ఐఆర్‌డీఏకు బదులుగా ఒక నోటిఫికేషన్ జారీతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించే అధికారాన్ని ఐఆర్‌డీఏ చట్టం 1999 కల్పించింది.
- విధానపరమైన అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌డీఏకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేసే అధికారాన్ని ఈ చట్టం కల్పించింది.
- బీమా రంగంలో ప్రస్తుత చట్టాల ప్రకారం ప్రభుత్వం 26% విదేశీవాటాను అనుమతిస్తుంది.
- బీమాలో పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వం ప్రజలకు వివిధ పన్ను ప్రోత్సాహకాలు కల్పిస్తోంది.

కీలక భారత సంఘాలు

- ప్రభుత్వం, ఐఆర్‌డీఏ, ప్రజల మధ్య చర్చలు, సంప్రదింపులను జీవిత బీమా మండలి(లైఫ్ ఇన్స్యూరెన్స్ కౌన్సిల్) పర్యవేక్షిస్తుంది. ఇది బీమా పరిశ్రమకు ముఖం వంటిది.
- భారతదేశంలో లైసెన్సు పొందిన బీమా బ్రోకర్లు అందరూ (ఐబీఏఐ) ఐఆర్‌డీఏ గుర్తించిన అత్యున్నత సంస్థగా ఏర్పడతారు.
- భారతదేశంలో గణక వృత్తిని ప్రోత్సహించేందుకు భారత గణకుల సంస్థ (ఐఏఐ) ప్రయత్నిస్తూ ఉంటుంది.
- సాధారణ బీమా వ్యాపారంలో బీమా కంపెనీలు ప్రతిపాదించే రేట్లు, నియమ నిబంధనలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన సంస్థ టీఏసీ.
- భారతదేశంలో బీమా విద్య, శిక్షణను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన సంస్థ ఐఐఐ.
- బీమా సిబ్బందిలో వృత్తి నైపుణ్యం, సత్ప్రవర్తన కల్పించేందుకు స్థానిక నియంత్రణ సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమ సంస్థలతో కలిసి సీఐఐ పనిచేస్తుంది.

**ఐఆర్‌డీఏ, ఇతర నియంత్రణ సంస్థల విధులు, అధికారాలు, బాధ్యతలు**

- బీమా పరిశ్రమను నియంత్రిస్తూ ప్రోత్సహించేందుకు ఐఆర్‌డీఏను ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా ఏర్పాటు చేశారు.
- ఐఆర్‌డీఏ చట్టం 1999లోని సెక్షన్ 14లో ఐఆర్‌డీఏ విధులు, అధికారాలు, బాధ్యతలను పొందుపరిచారు.
- బీమా అభివృద్ధి మరియు పున:బీమాను నియంత్రించడం, ప్రోత్సహించాల్సిన బాధ్యత ఐఆర్‌డీఏపై ఉంది.

**ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000**

- జూలై 2000 సంవత్సరంలో ఐఆర్‌డీఏ (బీమా ఏజెంట్ల లైసెన్సుల జారీ ప్రక్రియ) నియంత్రణలు 2000ను సంబంధిత అధికార సంస్థ బీమా ఏజెంట్లకు లైసెన్సుల జారీ, పునరుద్ధరణ కోసం జారీ చేసింది.
- బీమా ఏజెంట్ అవ్వాలనుకునే వ్యక్తి దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి నిర్దేశిత ఫీజును సంబంధిత అధికారికి సమర్పించాలి. అలాగే ఏజెంట్‌గా ఉండేందుకు అవసరమైన అన్ని అర్హతలతోపాటు శిక్షణ పూర్తి చేసుకొని పరీక్ష పాసై ఉండాలి.

**ప్రశ్న జవాబులు**

13.1

ఐఆర్‌డీఏ తన విధులను చేపట్టడంలో విఫలమవుతోందని కేంద్ర ప్రభుత్వం ఒకవేళ భావిస్తే కేవలం ఓ నోటిఫికేషన్ జారీతో ఆ సంస్థకు బదులుగా వ్యవహరించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

13.2

జీవిత బీమా కౌన్సిల్ విధులు ఈ కింది విధంగా ఉన్నాయి:

- అత్యున్నత నైతిక ప్రమాణాలు, పర్యవేక్షణ పాలన కొనసాగించడం
- పరిశ్రమపై ప్రజల్లో సానుకూలత కలిగేలా చూస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొనడం.
- జీవిత బీమా పాత్ర మరియు ప్రయోజనాల గురించి అవగాహన కలిగించడం.
- ప్రభుత్వం, శాసనసభ్యులు, నియంత్రణ సంస్థల మధ్య నిర్మాణాత్మక చర్చలకు ఏర్పాట్లు చేయడం.
- జీవిత బీమాలో పరిశోధన చేపడుతూ ఈ రంగం అభివృద్ధికి దోహదపడటం.
- ఆర్థిక సేవల రంగంలో ఇతర సంస్థలకు ఫోరమ్‌గా వ్యవహరించడం.
- బీమా విద్య, శిక్షణ, సదస్సుల్లో కీలక పాత్ర పోషించడం.
- సభ్యులకు అవసరమైన సాయం మరియు దిశానిర్దేశం చేయడం.
- భారతీయ జీవిత బీమా పరిశ్రమ మరియు ప్రపంచ మార్కెట్ల మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించడం.

13.3 ఐఆర్‌డీఏ కీలాకాంశాల్లో ఒకటి ఏమనగా, పోటీతత్వాన్ని ప్రోత్సహించడం. ఎందుకంటే వినియోగదారుల సంతృప్తి మేరకు తక్కువ ప్రీమియం ఉన్న పాలసీలను ఎక్కువగా ఎంపిక చేసుకొనే అవకాశాన్ని కల్పించడం. దీనివల్ల బీమా మార్కెట్‌లో ఆర్థిక భద్రతను లభిస్తుంది.

13.4 కొత్తగా బీమా ఏజెంట్‌గా మారే వ్యక్తికి 50 గంటల శిక్షణ అవసరం. అయితే అదనపు విద్యార్హతలు ఉంటే ఈ శిక్షణలో సడలింపు ఉంటుంది.

13.5 బీమా ఏజెంట్‌గా మారాలంటే చాలా దశలు, విభాగాలను సంతృప్తి పర్చాల్సి ఉంటుంది.

1. (నియంత్రణ 3 ప్రకారం) నిర్దేశిత ఫార్మాట్‌లో అభ్యర్థి దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉంటుంది. 250 రూపాయల రుసుమును చెల్లించాల్సి ఉంటుంది (నియంత్రణ 7).

2. కనీస విద్యార్హత ప్రమాణాలు చూపించడం; ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షను పాసై ఉండాలి. 5 వేల జనాభా పైగా ఉన్న ప్రదేశాల్లో నివసిస్తూ ఉంటే. లేదా దేశంలో ఎక్కడైనా నివసిస్తూ ఉంటే కనీసం 10వ తరగతి పాసై ఉండాలి. (నియంత్రణ 4).

3. ఖచ్చితంగా 50 గంటల ప్రాక్టీకల్ శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. (అదనపు విద్యార్హతలు ఉంటే ఇందులో మినహాయింపు ఉంటుంది (నియంత్రణ ర5)

4. బీమా వ్యాపారంలో ప్రీ రిక్రూట్‌మెంట్ పరీక్ష పాసై ఉండాలి (నియంత్రణ 6).

5. పై అంశాలను పూర్తిగా సంతృప్తి పరిస్తే మీకు లైసెన్స్ ను జారీ చేస్తారు. అలాగే బీమా వ్యాపారంలో పాలసీదారులకు సరైన సేవలు అందించేందుకు అవసరమైన కనీస నైపుణ్యం కలిగి ఉండాలి.

**స్వీయ ప్రశ్నలు**

1. బీమా ఏజెంట్‌కు ఉండాల్సిన కనీస విద్యార్హతలు ఏమిటి?

2. ఐఆర్‌డీఏ యొక్క అధికారాలు, కార్యక్రమాలు ఏడింటిని రాయండి?

3. ఐఆర్‌డీఏ చట్టం 1999 ప్రకారం కేంద్ర ప్రభుత్వం యొక్క పాత్ర ఏమిటీ?

4. భారతదేశంలో బీమా క్రింద పెట్టుబడి పెట్టేందుకు వీదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఎంత?

**వీటి జవాబులు పక్క పేజీలో చూస్తారు.**

**స్వీయ పరీక్ష ప్రశ్న, జవాబులు**

1. నియంత్రణ 4లో పేర్కొన్న దాని ప్రకారం అభ్యర్థి తగిన విద్యార్హతలు కలిగి ఉండాలి. ఆ అభ్యర్థి 5 వేల కన్నా ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతంలో నివసిస్తూ ఉంటే అప్పుడు అతను కనీసం 12వ తరగతి పాసై ఉండాలి. దీని కన్నా తక్కువగా ఉన్న ప్రాంతంలో నివసిస్తూ ఉంటే 10వ తరగతి పాసై ఉంటే సరిపోతుంది.

2. ఈ కింది వాటిలో ఏడింటికి సమాధానాలు ఇవ్వాలి

ఐఆర్‌డీఏ యొక్క విధులకు ఉన్న అధికారాలు ఏమిటీ:

ఎ) అభ్యర్థులకు లైసెన్స్ జారీ, పునరుద్ధరణ, సవరణ, ఉపసంహరణ, సస్పెన్షన్ లేదా రద్దు చేసే అధికారం

బి) పాలసీల  అసైన్ మెంట్, బీమాభిలాష, నామినేషన్లు, పాలసీల ఉపసంహరణ విలువ, ఇతర నియమ నిబంధనల విషయంలో పాలసీదారుల ప్రయోజనాలను కాపాడే అధికారం.

సి) ఏజెంట్లకు ఉండాల్సిన అర్హతలు నైతిక ప్రవర్తన నియమావళి, వాస్తవిక శిక్షణ గురించి వివరించడం

డి) సర్వేయర్లు, నష్టాన్ని అంచనా వేసే వ్యక్తులకు నైతిక ప్రవర్తన నియమావళిని గురించి వివరించడం

ఈ) బీమా వ్యాపారం నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించడం

ఎఫ్) బీమా, పున:బీమా వ్యాపారాలతో సంబంధం ఉన్న వృత్తి పరమైన సంస్థలను నియంత్రిస్తూ ప్రోత్సహించడం

జీ) బీమా కంపెనీల నుండి ఆర్థిక పథకాలకు రావాల్సిన ప్రీమియం ఆదాయం శాతాన్ని చెప్పడం

హెచ్) ఈ చట్టం ఉద్దేశ్యాన్ని అమలు చేసేందుకు ఫీజులు, ఇతర చార్జీలు విధించడం

ఐ) బీమా వ్యాపారానికి సంబంధించిన సంస్థల నుండి సమాచారం సేకరించడం, తనిఖీలు నిర్వహించడం, అడిట్ చేపట్టడం

జె)  టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ) నియంత్రణలో లేని సాధారణ బీమా వ్యాపారంలో బీమా కంపెనీలు ప్రతిపాదించే రేట్లు, నియమ నిబంధనలను నియంత్రించడం; బీమా చట్టం 1938లోని సెక్షన్ 64యు ప్రకారం

కె) అకౌంట్లను ఏ విధానంలో నిర్వహిస్తున్నారో, ఆ స్టేట్‌మెంట్లను బీమా కంపెనీలు, మధ్యవర్తి సంస్థల నుంచి తీసుకోవడం.

ఎల్). బీమా కంపెనీలు పెట్టే పెట్టుబడి విధానాలను నియంత్రించడం

ఎమ్). చెల్లించే స్థోమతపై నియంత్రణ విధించడం

ఎన్) బీమా కంపెనీకి, మధ్యవర్తి సంస్థలకు మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించడం

ఓ) టారిఫ్ సలహా కమిటీ (టీఏసీ) విధులను పర్యవేక్షించడం

పి) గ్రామీణ, సాంఘిక ప్రాంతాల్లోని ప్రజలు ఎంత శాతం మందికి సాధారణ, జీవిత బీమాను బీమా కంపెనీలు కల్పించాయో గుర్తించడం.

క్యూ) చట్టంలో ఉన్న ఇతర అధికారాలను ఉపయోగించుకునే హక్కు.

3. ఐఆర్‌డీఏ చట్టాల ప్రకారం కేంద్రప్రభుత్వం చేసే పని కింది విధంగా ఉంటుంది:

- పార్లమెంటులో చట్టం ద్వారా ఐఆర్‌డీఏకు గ్రాంట్లు మంజూరు చేయడం. నిబంధనల ప్రకారం పార్లమెంట్‌లో ఆమోదం తర్వాత మంజూరు చేయడం
- తరువాత,. ఐఆర్‌డీఏ అకౌంట్ల వార్షిక నివేదికను భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి పంపడం. తరువాత ఈ అకౌంట్ల నివేదికను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెడతారు.
- పాలనాపరమైన, సాంకేతికమైనవి కాకుండా విధానపరమైన ప్రశ్నలపై కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌డీఏకు ఆదేశాలు జారీ చేసే అధికారం ఉంటుంది.. కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఈ ఆదేశాలను ఎప్పటికప్పుడు ఇవ్వచ్చు. ఐఆర్‌డీఏ ఈ ఆదేశాలకు కట్టుబడి ఉండాలి.
- బీమా పరిశ్రమ ప్రోత్సాహం లేదా అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదిత లేదా ప్రస్తుత కార్యక్రమాల వివరాలను ఐఆర్‌డీఏ ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి.
- నిబంధనలను తయారు చేసేందుకు అవసరమైన అధికారాలను ఈ చట్టం కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తుంది. ఈ చట్టం ప్రకారం వనరుల కేటాయింపులను ఒక నోటిఫికేషన్ జారీ చేసి అమలు చేయవచ్చు.

4. ప్రస్తుత చట్టాల ప్రకారం బీమా రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు 26 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లను ప్రభుత్వం అనుమతిస్తుంది. విదేశీ సంస్థలతో కలిసి దేశవాళీ ప్రైవేట్ కంపెనీలు సంయుక్త భాగస్వాములుగా జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయవచ్చు. ఇందులో విదేశీ సంస్థలకు 26 శాతం వాటా మాత్రమే ఉంటుంది.